# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక






అమలాపురం | సంపుటి : 10 సంచిక : 26 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | మంగళవారం 18 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 26 18-03-2025 Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-


### మంత్రులను తొలగిస్తేనే
## పాలనపై పట్టు ఉన్నట్లా?

**ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి**
**పథకాల అమలులో పారదర్శంగా వ్యవహరించాలని ఆదేశించామన్న ముఖ్యమంత్రి**
**ఎస్సీ వర్గీకరణ కోసం మూడున్నర దశాబ్దాలుగా ఉద్యమం జరుగుతోందని వెల్లడి**




అమరావతి మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
తనకు పరిపాలనపై పట్టు రాలేదని కొంతమంది అంటున్నారని, మంత్రివర్గం నుండి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా? అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్లు అవుతుందా? అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని తమ ఎమ్మెల్యేలకు, అసలైన అర్హులకు పథకాలు తప్పకుండా వర్తింపజేయాలని అధికారులకు చెబుతున్నామని తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 54 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు.
మొదటి ఏడాదిలో ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు

- తరువాయి 2లో..

### ధ్వంసమైన రాష్ట్రాన్ని
# మళ్లీ ట్రాక్‌లో పెట్టాం

### ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
**2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల జీడీపీకి చేరాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. శాసనసభలో స్వర్ణాంధ్ర విజన్ -2047 డాక్యుమెంట్‌పై లఘు చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. “నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్ అమలుపరిచే బాధ్యత ఎమ్మెల్యేలదే. దాని అమలుకు ఎమ్మెల్యేలకు పూర్తిగా సహకరిస్తాం. 2047 కల్లా రాష్ట్ర తలసరి ఆదాయం రూ.55 లక్షలు సాధించేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. అప్పటికల్లా 2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థకు ఏపీ చేరాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధిరేటు సాధించేలా లక్ష్యం పెట్టుకున్నాం. వికసిత్ భారత్-2047ను ప్రధాని మోదీ అమలు చేస్తున్నారు.**



ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్‌లో పెట్టగలిగాం. దూరదృష్టితో ఆలోచించి ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు విజన్ 2020 తీసుకొచ్చాం. చెప్పిన దానికంటే ఎక్కువ ప్రయోజనమే ఉమ్మడి రాష్ట్రానికి కలిగింది. పేదరిక నిర్మూలన వంటి పది సూత్రాలను లక్ష్యంగా పెట్టుకున్నాం. రంగాల వారీగా ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. జిల్లాల వారీగా ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేస్తాం. మారిన ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు చేస్తున్నాం. రాళ్లసీమ

- తరువాయి 2లో..

## వైసీపీ హయాంలో భారీగా అవినీతి: పవన్ కల్యాణ్

**ఉపాధి హామీ పథకంలో అవినీతిపై పవన్ కల్యాణ్ తీవ్ర విమర్శలు**
**అసెంబ్లీలో పవన్ ఆరోపణలు**



అమరావతి మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఏపీ ఉపాధి హామీ పథకాన్ని గత వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా దుర్వినియోగం చేసిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా మాట్లాడిన ఆయన, పథకానికి కేటాయించిన రూ.250 కోట్ల నిధులు అవినీతికి బలయ్యాయని అధికారుల నివేదికలు చెబుతున్నాయని పేర్కొన్నారు. పథకం లక్ష్యాన్ని దారి తప్పించి, కొందరు అధికారం చేతిలో పెట్టుకున్న వారితో కలిసి అక్రమ లావాదేవీలు జరిపారని ఆరోపించారు. ప్రభుత్వ నిధులను అనుచితంగా వినియోగించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. లబ్ధిదారులకు చేరాల్సిన నిధులు మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లడం దురదృష్టకరమని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**564 మండలాల్లో సోషల్ ఆడిట్**

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 564 మండలాల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించిందని వెల్లడించారు. ఈ పరిశీలనలో అనేక అవకతవకలు బయటపడ్డాయని, లబ్ధిదారులకు చేరాల్సిన నిధులు కొందరు మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లినట్లు గుర్తించామని తెలిపారు. ఉపాధి హామీ కింద ఖర్చు చేసిన నిధుల్లో అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయని పేర్కొన్నారు. పథకం అమలులో అధికారుల పాత్రపై అనేక అనుమానాలు తలెత్తాయని, కొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా నిధుల మళ్లింపు జరిగిందని గుర్తించామని తెలిపారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన

- తరువాయి 2లో..

## వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతున్నారు: నారా లోకేశ్


**సభా సమావేశాల నుంచి నేడు వైసీపీ సభ్యుల వాకౌట్**
**బయట ఉన్న వైసీపీ సభ్యులను మార్షల్స్ సాయంతో లోపలికి తీసుకురావాలన్న లోకేశ్**
**చైర్మన్ కు ఆ అధికారం ఉందని వెల్లడి**



అమరావతి మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
వైసీపీ హయాంలో టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు ప్రయత్నించారని మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. ఇప్పుడు ఆ అంశంపై సభలో చర్చలో పాల్గొనకుండా, వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతున్నారని ధ్వజమెత్తారు. శాసనమండలిలో 2019–24 మధ్య అవినీతి, అక్రమాలపై చర్చను నిరసిస్తూ వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందించారు. “సభా సమావేశాల అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది. అందరూ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. 2019–24 మధ్య జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాల అంశంపై చర్చకు అనుమతిస్తూ మండలి ఛైర్మన్ ఆదేశాలు జారీచేశారు. బీఏసీలో వైసీపీ సభ్యులు అంగీకరించారు. చర్చలో వైసీపీ సభ్యులు 2014–19 మధ్య జరిగిన పాలనపై ఆరోపణలు చేసి.. ఇప్పుడు సమాధానం ఇస్తుండగా వాకౌట్ చేస్తున్నారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతారు. సమాధానానికి సమయం ఇవ్వరు. మేం సమాధానం ఇచ్చే సమయంలో సభలో ఉండరు. ఇది మొదటిసారి కాదు... పదేపదే ఈ విధంగా చేస్తున్నారు. గతంలో మార్షల్స్ ను పెట్టి సభను నడిపించిన పరిస్థితి చూశాం. ఇప్పుడు మార్షల్స్ ను పెట్టి బయట ఉన్న సభ్యులను సభకు తీసుకురావాలని ఛైర్మన్ ను కోరుతున్నాం. ఆ అధికారం ఛైర్మన్ కు ఉంది. 2014–19 మధ్య పాలనపై వైసీపీ సభ్యులు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి కేసులు పెట్టారో చూశాం. చేయని తప్పునకు చంద్రబాబు గారిని 53 రోజుల పాటు జైల్లో పెట్టారు. మొదట రూ.3వేల కోట్ల కుంభకోణం అన్నారు, తర్వాత రూ.300 కోట్లని, తర్వాత రూ.27 కోట్లు అని అన్నారు. చేయని తప్పునకు జైలుకు పంపారు. అచ్చెన్నాయుడు గారిని, ధూళిపాళ్ల నరేంద్ర గారిని, కొల్లు రవీంద్ర గారిని, నారాయణ గారిని.. అందరినీ ఇబ్బంది పెట్టారు. చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. ఇవన్నీ బయటపడతాయని భయపడుతున్నారా? ఆరోపణలు చేసి పారిపోతున్నారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మా నాయకులు చేయని తప్పులకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు యత్నించారు. ఆ కేసులపై చర్చించాలి. నాపైనా 23 కేసులు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. హత్యాయత్నం కేసు పెట్టారు. చర్చకు లేకుండా పారిపోయారు. ఇది సరికాదు” అని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు!

- **202 మండలాల్లో వడగాల్పుల హెచ్చరికలు**
- **హెచ్చరికలు జారీ చేసిన విపత్తుల నిర్వహణ సంస్థ**
- **అనకాపల్లి జిల్లా నాతవరంలో అత్యధికంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**



అమరావతి మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ఈసారి భానుడు చెలరేగిపోతున్నాడు. వేసవి ప్రారంభానికి ముందే గుబులు పుట్టిస్తున్నాడు. మార్చి ముగియక ముందే ఉష్ణోగ్రత 42 డిగ్రీలు దాటేసింది. దీంతో బయటికి రావాలంటే జనం భయపడుతున్నారు. మున్ముందు ఎండలు మరింత మండిపోతాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఇక నేడు రాష్ట్రంలోని 202 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. విజయనగరం జిల్లాలోని 15 మండలాలు, పార్వతీపురం మన్యంలో 12, శ్రీకాకుళంలో 8 మండలాల్లో తీవ్ర వడగాల్పులు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, పల్నాడు జిల్లాలో 19 మండలాలు, తూర్పుగోదావరిలో 19, అనకాపల్లిలో 16, శ్రీకాకుళంలో 16, కాకినాడలో 15, గుంటూరులో 14, ఏలూరులో 13, కృష్ణాలో 10, విజయనగరంలో 10, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 9, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 9, ఎన్టీఆర్ జిల్లాలో 8, పార్వతీపురం మన్యంలో 3, పశ్చిమ గోదావరిలో 3, విశాఖలో 2, బాపట్ల జిల్లాలో ఒక మండలంలో వడగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు.
నిన్న అనకాపల్లి జిల్లా నాతవరంలో

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం
దినపత్రిక

# సంపాదకీయం

## ట్రంప్‌నకు ప్రతిఘటన!

సుంకాల పోరు మొదలైంది. అమెరికా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై బుధవారం నుంచి సుంకం పెంచారు. అంతకు ముందు సోమవారం నుంచే చైనా సుంకాలు అమల్లోకి వచ్చాయి. మహాభారతంలో అర్జునుడు రెండు చేతులతో ఒకే సామర్ధ్యంతో బాణాలను సంధించిన కారణంగా సవ్యసాచి అనే పేరు వచ్చింది. అదే మాదిరి అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ మిత్రులు, శత్రువులు అని లేకుండా ఎడాపెడా సుంకాలు విధిస్తున్నాడు. దీనికి ప్రతిఘటన పెరుగుతున్నట్లు పరిణామాలు సూచిస్తున్నాయి. వెనక్కు తగ్గకపోతే బాధితురాలైన ప్రతిదేశం ఒక రోజు అటూ ఇటూగా తన అస్త్రాలను సంధించకమానదు. మొండి వైఖరిని వీడకుండా ముందుకే మునుముందుకే అంటే మాంద్యంలో మునిగేది అమెరికా అని అనేక మంది ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాచపీనుగ ఒంటరిగా పోదనట్లు మాంద్యం యావత్ ప్రపంచాన్ని ఏదో విధంగా ఆవరిస్తుంది. గోల్డ్‌మన్ శాచస్ 20శాతం అంటే జెపి మోర్గాన్ 40శాతం అమెరికా మాంద్య అవకాశాలు న్నాయని ప్రకటించింది.

తొలుత చైనా, కెనడా, మెక్సికోల మీద పోరు శంఖం పూరించిన ట్రంప్ తర్వాత బ్రిక్స్ దేశాలు, ఐరోపా యూనియన్, ప్రత్యేకించి మనదేశాన్ని కూడా ఆ జాబితాలో కలిపాడు. అంతటితో ఊరుకోలేదు, సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకరించిందని బహిరంగంగా ప్రకటించాడు.మన విశ్వగురువు మౌనవ్రతం పాటిస్తూ అలాంటిదేమీ లేదని పార్లమెంటరీ కమిటీ ముందు ఒక అధికారితో చెప్పించారు. అదే సమయంలో ఎలన్‌మస్క్ స్టార్‌లింక్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ప్రకటించాయి. ఇంతవరకు అసలు స్టార్‌లింక్‌కు మనదేశం అనుమతి ఇవ్వకుండానే ఈ ప్రకటనలు వెలువడ్డాయంటే తెరవెనుక ఏదో జరిగిందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఉనికిలో లేని కంపెనీ సేవలు అవి ఎలా అందిస్తాయి ? అమెరికా దిగుమతులపై కెనడా, ఐరోపా యూనియన్ కూడా 25శాతం వంతున ప్రతి సుంకాలు ప్రకటించాయి. మనదేశం మౌనంగా ఉంది. వాణిజ్యాలకు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలు ఉన్నాయి. వాటిని పక్కన పెట్టి పలుకుబడితో వేర్వేరుగా దేశాలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి.వాణిజ్య పోరులో ఒక దేశం ఎక్కువా తక్కువా అన్నది పక్కన పెడితే ప్రతిదేశం నిబంధనలకు పాతరవేస్తున్నట్లే.

ప్రపంచీకరణ యుగంలో ప్రతిదేశం మరొకదాని మీద ఏదో విధంగా ఆధారపడి ఉన్నందున కర్ర ఉన్నవాడిదే గొర్రె అంటే కుదిరే రోజులు కావివి. మా వస్తువుల మీద పన్నులు వేస్తే మీ కొన్ని రాష్ట్రాలకు సరఫరా చేసే విద్యుత్ నిలిపివేత లేదా పన్నులు వేస్తామని కెనడాలో ఓంటారియో అనే ఒక రాష్ట్ర ప్రధాన మంత్రి కూడా ప్రపంచ అగ్రరాజ్య అధిపతి ట్రంప్‌ను హెచ్చరించాడంటే ఆ ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది. బలవంతుడైన సర్పము చలి చీమలచేత చచ్చినట్లుగా పరిస్థితి ఉందన్నది స్పష్టం. ఒక హానికారక వైరస్ పుట్టుక ఎక్కడైనా ఎటు గాలివీస్తే అటు విస్తరిస్తుంది, తన మన అనే విచక్షణ లేకుండా ఎవ్వరినీ వదలదు.వాణిజ్య పోరు కూడా అలాంటిదే. ఒక వేళ వచ్చే నెల రెండవ తేదీ నుంచి మన వస్తువుల మీద కూడా ట్రంప్ వేటు పడితే ఒక ప్రధాన ఎగుమతి అయిన ఔషధ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితం కావచ్చని చెబుతున్నారు. జనరిక్ మందుల ధరలు పెరిగితే కోట్లాది మంది అమెరికన్ రోగులు, గిట్టుబాటుగాక మన పరిశ్రమలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ రంగంలోని కార్మికులు, ఉద్యోగులు, వాణిజ్యం కూడా ప్రభావితంగాక తప్పదు.మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న జనరిక్స్ విలువ ఏటా 12.7 బిలియన్ డాలర్లు కాగా దాని వలన అమెరికాకు 219 బిలియన్ డాలర్ల మేర ఆరోగ్య ఖర్చు తగ్గిందని అంచనా.

మన దేశం అమెరికా, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న 36 ప్రాణాధార ఔషధాలపై సుంకాలను పూర్తిగా ఎత్తివేసినప్పటికీ ట్రంప్ సంతృప్తి చెందినట్లు కనిపించటం లేదు. మన వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ అమెరికా వెళ్లి సంప్రదింపులు జరిపిన తర్వాతే ట్రంప్ మనమీద సుంకాల యుద్ధ ప్రకటన చేశాడు.అందరూ నష్టపోతారంటూ ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ చేసిన హెచ్చరికను వాణిజ్యపోరుకు నాందిపలికిన ట్రంప్ తలకెక్కించుకుంటాడా! తగ్గేదేలే అంటూ ముందుకు పోతాడా!! సుంకాల పోరులో అంతిమంగా పరాజితులు వినియోగ దారులే. ఏ దేశం ఎంత పన్ను పెంచితే ఆ మేరకు భారం భరించాల్సిందే. వస్తువుల కొనుగోలు తగ్గించుకుంటే అది ఒక విషవలయంలా మారుతుంది.చివరకు కష్టజీవులనే బలి తీసుకుంటుందన్నది చరిత్ర చెప్పిన సత్యం.

# ఎమ్మెల్యేలపై రఘురామ ఆగ్రహం కారణం

అమరావతి మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ తనదైన శైలిలో నిర్ణయాలు తీసుకుంటూ, వ్యాఖ్యలు చేస్తూ సరదాగా కనిపిస్తున్న రఘురామకృష్ణంరాజు ఇవాళ మాత్రం ఓ విషయంలో ఎమ్మెల్యేలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ నియమాలు, గతంలో స్పీకర్లు ఇచ్చిన రూలింగ్స్, సభా గౌరవాన్ని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలపై ఆయన ఫైర్ అయ్యారు. అదే సమయంలో వారికి కీలక సూచనలు చేశారు.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సభకు హాజరవుతున్న ఎమ్మెల్యేలు మొబైల్ ఫోన్లను వాడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు గుర్తించారు. అసెంబ్లీ ప్రాంగణం, లాబీల్లో మాత్రమే కాకుండా ఏకంగా సభలోనే ఫోన్లు మాట్లాడుతూ కనిపించడంపై రఘురామరాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంత మంది ఎమ్మెల్యేలు సభలో ఫోన్లు మాట్లాడుతున్నారని, అత్యవసర పరిస్థితి అయితే ఫోన్ బయటకు వెళ్లి మాట్లాడాలని వారికి సూచించారు.అలాగే సభలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు తమ ఫోన్లను సైలెంట్ లో పెట్టుకోవాలని రఘురామ మరో సూచన చేశారు.

**వేగుళ్ల జోగేశ్వరరావు సూచన**

అయితే, అసెంబ్లీలో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నియంత్రించేందుకు టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జామర్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ స్పీకర్‌కు సలహా ఇచ్చారు. దీనిపై రఘురామ స్పందిస్తూ, "మన బలహీనతను జామర్లపైకి నెట్టొద్దు" అంటూ వ్యంగ్యంగా హితవు పలికారు. సభలో నిబంధనల ప్రకారం క్రమశిక్షణ పాటించడం, సభ్యులు సభా గౌరవాన్ని కాపాడుకోవడం చాలా కీలకమని రఘురామకృష్ణంరాజు తన సూచనల ద్వారా స్పష్టంగా తెలియజేశారు.సభా సమావేశాల్లో ప్రజాప్రతినిధులు మొబైల్ ఫోన్లు ఉపయోగించడం మర్యాద కాదని, అసెంబ్లీ గౌరవాన్ని కాపాడే విధంగా ప్రవర్తించాలని ఆయన సూచించారు. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యలపై చర్చించే, ప్రజలకు మేలు చేసే విధంగా పాలనను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన వేదిక.

ప్రజా ప్రతినిధులు, ముఖ్యంగా ఎమ్మెల్యేలు, తమ బాధ్యతను మరచిపోకుండా, సభా గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రవర్తిస్తేనే అసెంబ్లీ సమర్థంగా నడుస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

మొబైల్ ఫోన్ల వినియోగం వంటి చిన్న చిన్న విషయాల్లో కూడా క్రమశిక్షణ పాటిస్తే, సమయాన్ని సమర్ధవంతంగా ఉపయోగించుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో ఇప్పటికే సభ్యులకు ఫోన్లు తెచ్చుకొచ్చేందుకు అనుమతి ఉండదు.ఏపీ అసెంబ్లీలో కూడా ఇలాంటి నిబంధనలు అమలు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆకస్మిక పర్యటనకు చంద్రబాబు కసరత్తు

## చంద్రబాబు స్పీడ్ - కీలక నిర్ణయాలు, పెట్టుబడుల ఆమోదం

అమరావతి మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో వేగం పెంచారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ఆయన కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి పథకాల అమలుపై కసరత్తు కొనసాగుతోంది. పాలనా వ్యవహారాల్లో సమర్థతను పెంచేలా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాల పర్యటనల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. నేడు జరగనున్న మంత్రివర్గ సమావేశం అమరావతిపై కీలక నిర్ణయాలను తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా, సీఆర్డీయే ఆమోదించిన పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. రాష్ట్ర రాజధాని అభివృద్ధికి సంబంధించి, రూ. 22,607 కోట్ల విలువైన 22 ప్రధాన పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అదనంగా, మున్సిపల్ శాఖలోని పలు అజెండాలను ప్రభుత్వం ఆమోదించనుంది.

**సీఆర్డీయే అథారిటీ %-% భారీ టెండర్లకు ఆమోదం**

సీఆర్డీయే అథారిటీ ఇప్పటికే రూ. 37,702 కోట్ల విలువైన టెండర్లను ఆమోదించింది. మంత్రివర్గ భేటీలో వీటికి అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. టెండర్లు దక్కించుకున్న సంస్థలకు త్వరలోనే లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (%ాశీూ%) జారీ చేయనుంది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా చేపట్టబోయే రూ. 15,081 కోట్ల విలువైన 37 పనులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముంది.

**భూ కేటాయింపులు %-% రాజధాని అభివృద్ధికి పునాది**

రాజధాని అభివృద్ధికి కీలకంగా మారనున్న భూ కేటాయింపుల అంశాన్ని కూడా మంత్రివర్గం చర్చించనుంది. అమరావతిలో పలు సంస్థలకు భూమి కేటాయింపులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. మున్సిపల్ శాఖ అజెండాలతో పాటు, నాలుగవ ఎస్ఐపిబి (%ాఖూదీ%) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది.

**భారీ పెట్టుబడులకు ఆహ్వానం**

ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులను సమీకరించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే 10 ప్రముఖ కంపెనీల నుంచి రూ. 1,21,659 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముంది.

ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ %-% నెల్లూరు జిల్లా నాయుడుపేటలో రూ. 1,742 కోట్ల పెట్టుబడి.

దాల్మియా సిమెంట్ %-% కడప జిల్లాలో రూ. 2,883 కోట్ల పెట్టుబడి.

లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్ %-% విశాఖపట్నం నగరంలో రూ. 1,500 కోట్లతో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్.

సత్యవీడు రిజర్వ్ ఇన్‌ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్ %-% శ్రీ సిటీ పరిశ్రమల ప్రాంతంలో రూ. 25,000 కోట్ల పెట్టుబడి.

ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ %-% రూ. 58,469 కోట్ల పెట్టుబడి.

ఈ పెట్టుబడులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

**ప్రభుత్వం %-% పార్టీ సమన్వయంపై దృష్టి**

జిల్లాల పర్యటనలు, పాలన సమీక్ష, నూతన పథకాల అమలుపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ పనితీరు పట్ల మంత్రులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందజేయనున్నారు. మంత్రులు తన అంచనాలకు తగిన విధంగా వేగంగా పని చేయాలని స్పష్టం చేయనున్నారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అభివృద్ధికి బాటలు వేసేందుకు సిద్ధమవుతోంది. మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధి, రాజధాని నిర్మాణం, పథకాల అమలు వంటి అంశాల్లో వేగం పెంచనుంది.

### మంత్రులను తొలగిస్తేనే

# పాలనపై పట్టు ఉన్నట్లా?

ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పథకాలతో లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని అన్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 65 లక్షల మంది మహిళలకు త్వరలో నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తామని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత ఇప్పటి వరకు కులగణన జరగలేదని తెలిపారు. సమాజానికి ఎక్స్ రే వంటి కులగణన దేశమంతా జరగాలని రాహుల్ గాంధీ చెప్పారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మూడున్నర దశాబ్దాలుగా ఉద్యమం జరుగుతోందని తెలిపారు. తాము అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడిందని అన్నారు. ఇక, ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ. 3 కోట్లు పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పారు.

## మళ్లీ ట్రాక్‌లో పెట్టాం

ఎడారిగా మారిపోతుందని అనుకున్నారు. రాయలసీమను రతనాలసీమగా మార్చడం ఖాయం" అని చంద్రబాబు అన్నారు. చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఆమోదం లభించింది. నంబూరులో వీవీఐటీయూ విద్యాసంస్థకు ప్రైవేట్ వర్సిటీ హోదా కల్పిస్తూ ఆమోదం తెలిపింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. పలు సంస్థలకు భూకేటాయింపులకు కూడా నేటి కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. అటు, ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా సమర్పించిన నివేదికకు కూడా కేబినెట్ ఆమోదించింది. రాష్ట్రాన్ని యూనిట్ గా వర్గీకరణ చేయాలని నివేదిక కమిషన్ ఇవ్వగా, జిల్లాను యూనిట్ గా తీసుకుని వర్గీకరణ చేయాలన్న ఎమ్మెల్యేల ప్రతిపాదనపైనా కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకోవాలని నిర్ణయించారు. 2026 జనాభా లెక్కలు వచ్చాక జిల్లాను యూనిట్ గా తీసుకుని వర్గీకరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి జాతీయ ఎస్సీ కమిషన్ కు పంపాలని నిర్ణయించారు. బుడగజంగాలు, మరో కులాన్ని ఎస్టీల్లో చేర్చేందుకు తీర్మానం చేయాలని నిర్ణయించారు. వైఎస్సార్ జిల్లాను వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చుతూ నేటి కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. పెనమలూరులోని తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు.

# వైసీపీ హయాంలో భారీగా అవినీతి: పవన్ కల్యాణ్

## ఉపాధి హామీ పథకంలో అవినీతిపై పవన్ కల్యాణ్ తీవ్ర విమర్శలు

వారిపై కఠిన చర్యలు తప్పవని, ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై విచారణ జరిపి శిక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా నియంత్రణ చర్యలు అమలు చేస్తామని, పారదర్శకత పెంపుదలకు ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను రూపొందించనున్నట్లు తెలిపారు.

**వచ్చే నెలాఖరులోగా పూర్తి పరిశీలన**

ఇప్పటికే మొదలైన ఆడిట్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా మిగిలిన మండలాల్లో కూడా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధి హామీ పనులను సమీక్షించి, అవినీతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన వారిని వదిలిపెట్టబోమని, తప్పిదాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**వేతనాల పెంపుపై స్పష్టత**

ఇక ఉపాధి హామీ కూలీల వేతనాల పెంపు అంశం కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తుందని పవన్ కల్యాణ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తమవంతుగా కూలీలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉపాధి హామీ కింద పని చేసిన కార్మికులకు వారి వేతనాలు సమయానికి అందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

**భవిష్యత్తులో అవినీతికి తావులేకుండా చర్యలు**

ఉపాధి హామీ పథకం సజావుగా సాగేందుకు, భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిధులు సరైన విధంగా వినియోగించేందుకు ప్రత్యేక మెకానిజాన్ని అమలు చేస్తామని చెప్పారు. నిధుల వాడకంపై పూర్తిస్థాయి పారదర్శకత కోసం డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు!

అత్యధికంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, నంద్యాల జిల్లా రుద్రవరంలో 41.4 డిగ్రీలు, విజయనగరం జిల్లా పెదనందిపల్లిలో 41.8 డిగ్రీలు, ప్రకాశం జిల్లా గొల్లవిడిపి, కర్నూలు జిల్లా లద్దగిరిలో 41.4, పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట, అయ్యప్పపేటలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



## ఉక్కు, అల్యూమినియం
# సుంకాలపై తగ్గేదే లే: ట్రంప్

తమ వ్యాపార భాగస్వాములపై ఏప్రిల్ 2 నుంచి సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

వాషింగ్టన్: తమ దేశ ఉత్పత్తులపై సుంకాలను విధిస్తున్న దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతి సుంకాలతో విరుచుకుపడుతున్నారు. తమ వ్యాపార భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25 శాతమున్న సుంకాలను 50 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు ఇటీవల ప్రకటించారు. తాజాగా ఈ విషయంపై మాట్లాడుతూ.. తమ వ్యాపార భాగస్వాములపై ఏప్రిల్ 2 నుంచి సుంకాలు విధిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండదని.. ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గేదే లేదని అన్నారు.

సుంకాలపై ఏ దేశానికీ మినహాయింపులు కల్పించే ఉద్దేశం తమకు లేదని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. "ఏప్రిల్ 2 మన దేశానికి విముక్తి కలిగించే రోజు. ఇదివరకు అధికారంలో ఉన్న తెలివి తక్కువ అధ్యక్షులు తాము ఏమి చేస్తున్నామో కూడా తెలియకుండా మన సంపదను ఇతరులకు ఇస్తూ పోయారు. ప్రస్తుతం విధిస్తున్న సుంకాల ద్వారా అందులో కొంత భాగాన్ని తిరిగి పొందబోతున్నాము. ఇన్నాళ్లు వారు మన నుంచి వసూలు చేశారు. వాటన్నిటినీ తిరిగి వసూలుచేసుకోవడానికి ఆయా దేశాలపై అదనపు సుంకాలు విధిస్తున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు.

అమెరికా దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25శాతం సుంకాలను విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికో సహా ప్రపంచ దేశాలన్నింటికీ ఇది వర్తిస్తుందని తెలిపారు. దీనిపై తమ వాణిజ్య మంత్రికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మరిన్ని రంగాల్లోనూ సుంకాలను ప్రకటిస్తామని వెల్లడించారు. 'వారు మన ఉత్పత్తులపై 130శాతం సుంకాలు విధిస్తుంటే మనం ఏమీ విధించకపోవడం సరికాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత సుంకాల అమలు ప్రకటనతో అంతర్జాతీయ వాణిజ్య భాగస్వామ్య సంస్థల్లో ఆందోళన నెలకొంది.

## కేంద్ర ప్రభుత్వంపై
# ఢిల్లీ విమానాశ్రయం దావా



ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వంపై ఢిల్లీ విమానాశ్రయం దావా వేసింది. రక్షణశాఖకు చెందిన విమానాశ్రయంలోకి వాణిజ్య విమానాలను అనుమతించడాన్ని సవాల్ చేస్తూ జీఎంఆర్ సంస్థ దావా వేసినట్లు తెలిపింది. గాజియాబాద్ విమానాశ్రయంలోకి వాణిజ్య విమానాలను అనుమతిస్తే ఢిల్లీ విమానాశ్రయం ఆర్థికంగా నష్టపోతుందని ఆరోపిస్తూ.. మార్చి 10న న్యాయస్థానంలో దావా దాఖలు చేసినట్లు పేర్కొంది.

ప్రయాణికుల రద్దీ ఎక్కువగా లేకపోతే ఒక విమానాశ్రయానికి, మరో విమానాశ్రయానికి మధ్య 150 కి.మీ దూరం ఉండాలనే నిబంధనలను ప్రభుత్వం ఉల్లంఘించిందని అధికారులు దావాలో పేర్కొన్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు దాదాపు 30 కి.మీ దూరంలో ఉన్న హిండన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి కొనసాగుతున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసులకు ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోర్టును కోరారు. కాగా ఈ విషయంపై భారత విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించాల్సి ఉంది. ప్రపంచంలోని అత్యంత రద్దీ గల విమానాశ్రయాల్లో ఢిల్లీ విమానాశ్రయం ఒకటి. గతేడాది దాదాపు 73.6 మిలియన్ల మంది ప్రయాణికులు దీనిని ఉపయోగించారు. అయితే ప్రభుత్వ రుసుములు పెరగడం వల్ల దాదాపు 21 మిలియన్ డాలర్లు నష్టపోయింది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయాల యాజమాన్యంలో జీఎంఆర్‌కు మెజారిటీ వాటా ఉంది.

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో
# అమెరికా డీఎన్ఐ తులసీ గబ్బర్డ్ భేటీ..!

అమెరికా : రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ అధికారులు భేటీ అయ్యారు. సౌత్‌బ్లాక్‌లో ఈ సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతాపరమైన సంబంధాల బలోపేతం, ఇంటెలిజెన్స్ షేరింగ్ వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. సీమాంతర ఉగ్రవాదం కూడా వీరి చర్చల అజెండాలో ఉంది. ఓ రక్షణ ఒప్పందంపైనా చర్చలు జరిగినట్లు సమాచారం.



భారత్‌లో రెండున్నర రోజుల పర్యటనకు తులసీ న్యూఢిల్లీకి వచ్చారు. ఆమె గ్లోబల్ ఇంటెలిజెన్స్ కాంక్లేవ్‌లో కూడా పాల్గొన్నారు. ట్రంప్ రెండోవిడత కార్యవర్గంలోని సీనియర్ స్థాయి అధికారి భారత్‌ను సందర్శించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇప్పటికే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌తో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య నిఘా సమాచార పంపిణీ, సాంకేతిక పరిజ్ఞాన సహకారాన్ని పెంపొందించుకోవడం, భారత్–అమెరికాల ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుగుణంగా భద్రత రంగంలో బంధాన్ని బలోపేతం చేసుకోవడంపై వారిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఇండో–పసిఫిక్, ఖలిస్థానీ ఉగ్రవాదం వంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

### మోదీ-ట్రంప్ సమష్టి లక్ష్యాలపై దృష్టి

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంచి మిత్రులని తులసీ గబ్బర్డ్ పేర్కొన్నారు. "వారు సమష్టి లక్ష్యాలపై దృష్టిపెట్టారు. భారత్–అమెరికా సంబంధాలు ఎంతో పురాతనమైనవి. వాటిని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఇరుదేశాలు పరస్పర ప్రయోజనాలను గుర్తిస్తున్నాయి. శాంతి, సుసంపన్నత, స్వేచ్ఛ, భద్రత వంటి అంశాలు కేంద్రంగా ఇవి ఉన్నాయి. మన రెండు గొప్ప దేశాలకు ఉత్తమ నాయకులు ఉన్నారు. వారు మంచి మిత్రులు. సమష్టి లక్ష్యాలు, పరస్పర ప్రయోజనాలపై దృష్టిపెట్టారు. ఇక ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చాలా స్పష్టమైన వైఖరితో చూస్తున్నారు. ఆయన దృష్టి మొత్తం శాంతిస్థాపనపైనే ఉంది. యుద్ధాన్ని ముగించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. చర్చలు ఇప్పుడే మొదలయ్యాయి" అని తులసీ ఓ వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆదివారం డోభాల్ అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ దేశాల నిఘాధిపతుల సదస్సులో పాల్గొనడానికి తులసీ భారత్‌కు వచ్చారు. ఈ సదస్సులో కెనడా నిఘాధిపతి డేనియల్ రోజర్స్, యూకే జాతీయ భద్రత సలహాదారు జొనాథన్ పావెల్ తదితరులు కూడా పాల్గొన్నారు.

## ఈ నెల 19న వడ్డాదిలో
# ఉచిత కంటి వైద్య శిబిరం



**బుచ్చయ్యపేట, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**ఈ నెల 19వ తేదీ బుధవారం ఉదయం వడ్డాది జంక్షన్లోని వీరవిల్లి రోడ్ వెంకట పద్మ మెడికల్ షాప్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఏ. శివకుమార్ తెలిపారు.సంబంధిత కరపత్రాలను స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు ఆదివారం వడ్డాదిలో ఆవిష్కరించారు.**

విశాఖ శంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు.అవసరమైన వారిని గుర్తించి విశాఖలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు.శస్త్ర చికిత్సలకు వెళ్లే వారికి రవాణా సదుపాయం కల్పిస్తారన్నారు.శిబిరానికి హాజరయ్యేవారు ఆరోగ్యశ్రీ,ఆధార్, పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్, దీర్ఘకాలిక రోగాలకు మందులు వాడే వారు సంబంధిత మందులు,చీటీలను వెంట తీసుకురావాలన్నారు. టిడిపి నేతలు దొండా నరేష్,సాయం శేషు,ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



**నర్సీపట్నం, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నర్సీపట్నం ఆర్టీసి కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వివి.రమణ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఆర్జీలను సత్వరంఆ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీలను పరిష్కరించిన ఎంటనే సమాచారిన్న దరఖాస్తుదారులకు తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవెంకటేశ్వరుని దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న

**నర్సీపట్నం, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామివారిని సతీమణి పద్మావతి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తుల మధ్య అన్నప్రసాద స్వికరించారు.**

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కృపా కటాక్షాలు సర్వ జనులకు లభించాలని ఆకాంక్షించారు. దేవస్థానం వృద్ధి, భక్తుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గన్న ఆయన దంపతులను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు రంగనాయక మండపములో వేద పండితులు వేదాశీర్వచనము చేశారు.






డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 18 మార్చి 2025

## లక్ష్మీ నరసింహస్వామి ని దర్శించుకొన్న మంత్రి ఆనం

**సఖినేటిపల్లి, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ప్రముఖ పుణ్యక్షేత్రమయిన అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలికి వేదాశీర్వచనం పలికారు. దర్శనానంతరం మంత్రికి తీర్ధ ప్రసాదాలను స్వామి వారి చిత్ర పటం అందించారు.

## ఎంపీపీగా అరుణ బాధ్యతలు స్వీకరణ



**కాట్రేనికోన మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కాట్రేనికోన మండల పరిషత్ అధ్యక్షురాలుగా ఏడిది అరుణసుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా తాను బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు. కార్యక్రమం లో ఎంపీడీఓ ఎస్ వెంకట చలం, తహసీల్దార్ సునీల్ కుమార్, జడ్పిటిసి నేల కిషోర్ కుమార్, నడింపల్లి సూరిబాబు, ఏడిద సుబ్బు ,సర్పంచులు గంటి వెంకట సుధాకర్, చల్లగల వెంకటలక్ష్మి, చెల్లి సురేష్ ,వంకా ఏడు కొండలు, మల్లాడి వీర బాబ్జి,చోల్లంగి శ్రీలక్ష్మి, నాయకులు ఏడిద చక్రపాణిరావు, నల్లా నరసింహమూర్తి, కాశి హనుమంతరావు, ఎంపీటీసీ లు గెద్దాడ గుణ వేణు కుమార్, గుత్తుల సూర్య మహా లక్ష్మి, సంసానినాగేశ్వరరావు, జగడం బాలయోగి, ధర్మారావు, జగడం బాలయ్య, అర్ డబ్లు ఎస్ జే ఈ సుబ్రహ్మణ్యం,పలువురు అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు ఎంపీపీ అరుణను అభినందించారు.

## మండలంలో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం: ఎమ్మెల్యే దాట్ల



**కాట్రేనికోన మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కాట్రేనికోన మండలంలో గత కొంతకాలంగా లో వోల్టేజ్ సమస్య ఉందని ఆ సమస్య ఇప్పుడు తొలగిపోయిందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్ లో పరిధిలో ఇటీవల 8 ఎం వి ఏ లను ఏర్పాటు చేశారు. ఆదివారం ఎమ్మెల్యే వీటిని ప్రారంభించారు. గతంలో ఉన్న 5 ఎం వి ఏల స్థానంలో 8 ఎం వి ఏ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటివల్ల మండలంలో లో వోల్టేజ్ సమస్యకు తెరపడుతుందన్నారు. అదేవిధంగా పల్లంకుర్రు లో త్వరలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు,నడింపల్లి సుబ్బరాజు, గుత్తుల సాయి, చెల్లి సురేష్, ఆకాశం శ్రీనివాస్, చెల్లి అశోక్ , త్సవట పల్లి నాగు,ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, డి. సీతా రామ కృష్ణం రాజు, బండారుయేసు, వాసంశెట్టి రాజేశ్వరరావు,పి. రంగరాజు మాదే యోగేశ్వరి,సుంకర బుజ్జి,బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ, మట్ట రమేష్, కాండ్రేగుల సత్యప్రసాద్, చీకురుమెల్లి చక్రధర్,వీరబాబు, విద్యుత్ శాఖ డీఈ రాంబాబు, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్మెన్ సత్యనారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

10వ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కాగా అమలాపురం కొంకాపల్లి మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ సందర్శించారు. పరీక్షా కేంద్రంలోని తరగతి గదుల్లోకి వెళ్లి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే అమలాపురం రూరల్ మండలం కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల నిర్వహణ తీరును జాయింట్ కలెక్టర్ టి నిషాంతి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.



# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత

**- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ - జిల్లా స్థాయి గ్రీవెన్స్ లో 270 అర్జీలు**

**అమలాపురం, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి గ్రీవెన్స్ కార్యక్రమంలో అందే అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్ లోని గోదావరి భవన్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఓ బి.ఎల్.ఎన్.రాజకుమారి, డిఆర్డీఏ పీడీ డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి తదితరులు అర్జీదారుల నుంచి సుమారు 270 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులందరూ గ్రీవెన్స్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి తప్పకుండా వ్యక్తిగతంగా అర్జీలను ఓపెన్ చేసి చూడాలన్నారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన చేసుకోవడం, క్షేత్రస్థాయిలో అర్జీదారుని వద్దకు వెళ్లి సమస్య గురించి మాట్లాడడం, సమస్యను పరిష్కరించలేని పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు వివరించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలాన్నారు. రాష్ట్రస్థాయిలో ఆడిట్ టీములు అర్జీదారులకు ఫోన్ చేసి అర్జీల పరిష్కారంపై సంతృప్తి చెందారా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకుంటున్నారని అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రావలసిన అవసరం లేకుండా ఆయా మండల , డివిజన్ కేంద్రాల్లో నిర్వహించే గ్రీవెన్స కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 24, 25 తేదీల్లో అమరావతిలో కలెక్టర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్న నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి శాఖల వారీగా సంబంధిత శాఖల్లో ఉన్న సమస్యలను నివేదిక రూపంలో సమర్పించాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు శాఖల వారీగా జిల్లా స్థాయిలో సమీక్షించి జిల్లాలోని ప్రధాన సమస్యలను కలెక్టర్స్ కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే దిశగా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు అమలాపురం రూరల్ మండలం చింతాడ గరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతులు సమర్పించడానికి వచ్చిన అర్జీదారులకు కలెక్టర్ మజ్జిగను అందించారు. గత 3 సంవత్సరాలుగా వేసవిలో కలెక్టరేట్లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, డిసిహెచ్ఎస్ కార్తీక్, సిపిఓ వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సి.హెచ్.ఎన్.వి.కృష్ణారెడ్డి, డిపిఓ శాంతలక్ష్మి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.ప్రసాద్, పిఆర్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి , జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కోకో సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

**- జిల్లా ఉద్యాన అధికారి రమణ**



**అమలాపురం మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగును లాభసాటిగా మార్చేందుకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన అధికారి బి.వి,రమణ సోమవారం ఒక ప్రకటలో సూచించారు. కోకో గింజలకు మంచి గిట్టుబాటు ధరలు పొందాలంటే ఉత్పత్తుల నాణ్యతను పెంచాలని అందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కోకో ఏడాది పొడవునా కాపు ఉన్నప్పటికీ మార్చి నుంచి మే నెలాఖరు వరకు మూడు నెలల పాటు మంచి దిగుబడిని ఇస్తుందన్నారు. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి ఉంటాయన్నారు. కోకో గింజలకు జాతీయంగా, అంతర్జాతీయంగా మంచి డిమాండు ఉందన్నారు. వాతావరణ పరిస్థితులు, అనుకూలించక మార్కెట్ ఒడిదుడుకుల కారణంగా 2024లో కిలో నాణ్యమైన కోకో గింజలను రూ. 950 నుంచి రూ. 1,000 వరకు అధిక ధరలకు కొనుగోలు చేసారన్నారు. నేడు ధర రూ. 550 నుంచి రూ.650 మాత్రమే ఉందన్నారు. పసుపు చార వచ్చినా, పక్వానికి వచ్చిన కాయలను పదునైన కత్తితో తొడిమ చెట్టుకు ఉండే విధంగా కోయాలని, కోసిన కాయలను 2 నుంచి 3 రోజులు నిల్వచేసిన తర్వాత పగులగొట్టి గింజలు తీయాలని సూచించారు. కాయలను కర్ర ముక్కతో మధ్యభాగంలో బద్దలు కొట్టి, గింజలను గుజ్జుతో సహా వేరు చేయాలన్నారు. కాయ మధ్య భాగంలో ఉన్న కాడను, తొక్కను పులియ బెట్టడానికి ముందు తొలగించాలని, కోకోలో ప్రతి సంవత్సరం సెప్టెంబరు నుంచి జనవరి, ఏప్రిల్ నుంచి జూన్ నెలల మధ్య రెండు కాపులు లభిస్తాయన్నారు.

**మధ్యవర్తిత్వం మరియు రాజీ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో**

# కేసుల సత్వర పరిష్కారం అయ్యే అవకాశం

- **మార్చి 17 వ తేది నుంచి 21 వ తేది వరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అడ్వకేట్లకు శిక్షణ అందించనున్నాం.**
- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత**



**రాజమహేంద్రవరం మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు వారి సూచనలతో మధ్యవర్తిత్వం రాజీ నేపథ్యం లో ఎమ్ సి పి సి విధానం పై జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లకు అవగాహనా తో కూడిన శిక్షణ అందించడం జరుగుతొందని , తద్వారా సత్వర న్యాయం జరగడమే సాధ్యం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక జిల్లా కోర్టు నందు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశ మందిరంలో సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు మధ్యవర్తిత్వం మరియు రాజీ ప్రాజెక్ట్ కమిటీ (%వీజూజ%) ఆధ్వర్యంలో జిల్లాలోని 36 మంది న్యాయ వాదులకు " మధ్యవర్తిత్వం యొక్క కాన్సెప్ట్ %ఉ% టెక్నిక్‌లు"పై 48 గంటలు ఐదు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమానికి జిల్లా జడ్జి శ్రీమతి గంధం సునీత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎమ్ సి పి సి ఇద్దరు మాస్టర్ ట్రైనర్ అధ్వర్యంలో అవగాహనా శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత మాట్లాడుతూ గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎంసిపిసి కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు వారి సూచనలతో మధ్యవర్తిత్వం, రాజీ మార్గం అనే అంశం పై జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లకు అవగాహనా తో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 17 వ తేది నుంచి 21 వ తేది వరకు 48 గంటల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లకి, ఇతర న్యాయమూర్తులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలలో పాల్గొనడం జరిగిందనీ తెలిపారు. ఇందులో ఎన్నో అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఎంసిపిసి యాక్ట్ ప్రకారం 2023 ప్రొవిజన్ ప్రకారం జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లకు శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. కోర్టు సంబంధిత కేసుల్లో పరిష్కారం కొరకు నాలుగు విధానాలు ఉన్నాయన్నారు. ఇందులో మధ్యవర్తిత్వ రాజీ మార్గం.. లోకాదళత్ కూడా రెండు అంశాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో మధ్యవర్తిత్వం కు సూచించిన కేసులకు సంబంధించి కేసు పరిష్కారం అయ్యే విధంగా శిక్షణ పొందిన జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లను నామినేట్ చేయటం జరుగుతుందన్నారు. వీరు సంబంధిత కేసు యొక్క ఇరు పార్టీలను పిలిపించి వారితో ఆమోదయోగ్యం దిశగా సంతకాలు చేయించి ఆరు నెలల లోపు కేసు పరిష్కారం అయ్యే విధంగా శిక్షణ పొందిన అడ్వకేట్ వారిని ఒకటి లేదా రెండు సిట్టింగుల్లో నిబంధనలు మరియు షరతులు మేరకు కేసు రాజీ అయ్యేవిధంగా పరిష్కరిస్తారన్నారు. ఇలా పరిష్కారమయ్యే కేసులకు లోకాదళత్ మాదిరిగానే అప్పీల్ కూడా ఉండదన్నారు. అదేవిధంగా కోర్టు కు చెల్లించిన ఫీజు కూడా తిరిగి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నందున గౌరవ హైకోర్టు వారి సూచనల మేరకు జుడిషియల్ అధికారులకు, అడ్వకేట్లను నామినేట్ చేసి నామినేట్ చేసిన కేసులను పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. తమిళనాడు కి చెందిన మాస్టర్ ట్రైనర్ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో చేపడుతున్న న్యాయవాదుల శిక్షణాకార్యక్రమాలను నిర్వహిస్తూ జిల్లా కు రావడం జరిగింది అని పేర్కొన్నారు. వసతి తో కూడిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం కోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి(ఇన్చార్జి) ఎస్.కె. జానీ భాషా , ఇద్దరు సీనియర్ మాస్టర్ ట్రైనర్ (తమిళ నాడు) శ్రీమతి ఆర్. విజయ కమల గారు శ్రీమతి ఆర్. రత్నతారా , ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కు చెందిన 36 మంది న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరులో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు.

**ఏలూరు మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రజాసంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతోందని ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పేర్కొన్నారు. దీనిలో భాగంగానే అవసరమైన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఏలూరు 4, 5 డివిజన్ల పరిధిలోని నాగేంద్రకాలనీ ఐబిఎమ్ చర్చి నుండి ఆంజనేయస్వామి గుడి రోడ్డు వరకు మున్సిపల్ కార్పొరేషన్ 15వ ఆర్థిక సంఘం నిధులు 29లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పలనాయుడు శంకుస్థాపన చేశారు. తొలుత వారికి ఆత్మీయ స్వాగతం లభించింది అన్నారు అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజాక్షేత్రంలో నిలిచి వారి సమస్యలు తీర్చాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ప్రాధాన్యతాక్రమంలో దశలవారీగా నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నానన్నారు. దీంతో ఒక్కో సమస్యకూ మోక్షం లభిస్తోందన్నారు.. ఇదేక్రమంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారించామని స్పష్టం చేశారు. ప్రజాక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యంగా ఏలూరులో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లకు ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సారధ్యంలో శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని, ఏలూరులో చిన్న చిన్న వర్షాలకే ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో రోడ్లు నిర్మించడం శుభ పరిణామం అన్నారు. ఈ ప్రాంత ప్రజలు కూడా దీనిని స్వాగతిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి ఏ సమస్యను తీసుకెళ్ళిన ఆయన వెంటనే పరిష్కరిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలోనే ఏలూరుని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అన్నారు వారితో మా ప్రయాణం అభినందనీయమన్నారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో అవసరమైన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే బడేటి చంటి సారథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, డిప్యూటి మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, టిడిపి నాయకులు అమరావతి అశోక్, రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు.

**తొలిరోజు పరీక్షకు 91.60 శాతం మంది విద్యార్థుల హాజరు**

**పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.**

**ఏలూరు మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమయిన నేపథ్యంలో ఏలూరు అశోక్ నగర్ లోని కెపిడిటి పాఠశాల నందు పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ పరీక్షా కేంద్రంలో 192 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సివుండగా 100 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు 25,179 మంది విద్యార్థులకు గాను 23,064 మంది (91.60 %) శాతం విద్యార్థులు హాజరు కాగా 2,115 మంది విద్యార్థులు గైర్హాజరైనారు. 54 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేశాయన్నారు. పకడ్బందీగా పదోతరగతి పరీక్షలను నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన త్రాగునీరు, ఇతర వసతులను, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన పదోతరగతి తెలుగు పరీక్షలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల తనిఖీలో భాగంగా డిస్ట్రిక్ట్ లెవెల్ అబ్జర్వర్ 09 పరీక్షా కేంద్రములు, డిఇఓ 06 పరీక్షా కేంద్రములు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ వారు 04 పరీక్షా కేంద్రములు మొత్తం 74 పరీక్షా కేంద్రములను తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు.

## రాష్ట్రపతి అల్పాహారం విందుకు హాజరైన ఏలూరు ఎంపీ మహేష్ కుమార్.


**ఏలూరు మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్ లో సోమవారం ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు సహచర పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులతో కలిసి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన పరిచయ కార్యక్రమంలో ఎంపీ మహేష్ కుమార్ చేతులు జోడించి రాష్ట్రపతి ముర్ముకు నమస్కరించారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము ఇచ్చిన అల్పాహారం విందులో ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. చివరిగా రాష్ట్రపతి ముర్ముతో సహచర ఎంపీలతో కలిసి మహేష్ కుమార్ గ్రూప్ ఫోటో దిగారు.

# ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా అధికారులు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.**



**ఏలూరు మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత నివ్వడంతో పాటు అర్జీలు రీ ఓపెన్ లేకుండా పరిష్కార చర్యలు ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్ కార్యాలయం గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తోపాటు జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్వో వి. విశ్వేశ్వరరావు,ఆర్డివో అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్ లతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారులనుంచి అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లాలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి నాణ్యతగల ఎండార్స్ మెంట్ అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 318 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా శాఖాధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలుతీసుకోవాలని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కార ధ్యేయంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. జిల్లాలోని అందరూ మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల్లో పి-4 సర్వే, ఎంఎస్ఎంవి సర్వే నూరు శాతం పూర్తి అయ్యేలా కృషి చేయాలన్నారు.

**అందిన అర్జీలలో కొన్ని..**

ద్వారకాతిరుమల మండలం పంగెడిగూడెంకు చెందిన వెలివల గోపి అర్జీనిస్తూ తమ కుమారుడు తమ ఆస్తులు స్వాధీనంచేసుకుని తనను ఏవిధంగా చూడటంలేదని అతనివల్ల ప్రాణహాని ఉందని తెలిపారు. పెదవేగి మండలం పినకడిమికి చెందిన తాటికొండ సాయిసంతోష్ కుమార్ అర్జీనిస్తూ శనివారపుపేట గ్రామ పంచాయితీ పరిధిలో గవరవరంలో తమ భూమిని 22ఎ లిస్టులో పెట్టినందున దానిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లింగపాలెం మండలం యడవల్లి గ్రామానికి చెందిన గజ్జెల దుర్గారావు అర్జీనిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మూలంగా తమఇల్లు పూర్తిగా కాలిపోయిందని, దీని మూలంగా తమ పిల్లల జనన ధృవీకరణ పత్రాలు, ఇతర డాక్యుమెంట్లు కూడా పూర్తిగా కాలిపోయాయన్నారు. ఈ పరిస్థితుల్లో తమకు ఇల్లు, ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నూజివీడు మండలం సీతారాంపురానికి చెందిన కన్నికంటి విజయభారతి అర్జీనిస్తూ పోలవరం కాలువ త్రవ్వకంలో తాము నివాసగృహం, భూమిని కోల్పోయామని ఈ దృష్ట్యా ఇల్లు, ఇంటిస్థలం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మినుములు, పెసలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

## జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

**ఏలూరు మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఎ.పి.మార్క్ ఫేడ్ మరియు నాఫేడ్ అధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో మినుములు, పెసలు(అపరాలు) కొనుగోలు కేంద్రాలు నేటి నుండి ప్రారంభిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెసలు కొరకు పెదపాడు, వట్లూరు, డిసిఎంఎస్ ఏలూరు, జాలిపూడి, దెందులూరు సొసైటీలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మినుములు కొరకు లింగాల, దేవపూడి, తామరకొల్లు, డిసిఎంఎస్ ఏలూరు, దెందులూరు, డిసిఎంఎస్ అప్పన్నవీడు, పెదపాడు, వెంకటాపురం సొసైటీలలో కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సిఎం యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతు కూడా తమకు కేటాయించిన తేది ప్రకారం కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి తమ పంటను విక్రయించుకోవచ్చున్నారు. క్వింటా ప్రభుత్వం మద్దతు ధర పెసలు రూ. 8,682/- మరియు మినుములు రూ.7,400/- కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

**నాణ్యత ప్రమాణాల వివరములు.**

ఇతర వ్యర్థా పదార్థాలు 2 శాతం, దెబ్బతిన్న పప్పుదినుసులు గింజలు 3శాతం, కొద్దిగా దెబ్బతిన్న , రంగులేని పప్పుదినుసు గింజలు 4శాతం, పక్వానికి రాని, ముడత/కుచించుకుపోయిన పప్పుదినుసులు గింజలు 3శాతం, ఇతర పప్పుదినుసు గింజలు 3 శాతం, పురుగు పట్టిన పప్పుదినుసు గింజలు 4శాతం, తేమ శాతం 12శాతం, రైతుల వద్ద నుండి మాత్రమే మద్దతు ధరపై కొనుగోళ్ళు చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు కలిగిన పెసలు మరియు మినుములు మాత్రమే కొనుగోళ్ళు నగదు రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా చెల్లిస్తామన్నారు. వివరాల కొరకు సంప్రదించవలసిన నంబర్లు: మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్, నెంబర్: 9100955934, కంట్రోల్ రూమ్ నెంబర్: 7702003584, నెంబర్లను సంప్రదించవచ్చున్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమైన 10వ పరీక్షలు : కలెక్టర్

**రాజమహేంద్రవరం, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుండి ప్శాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి వెల్లడించారు. సోమవారం ఉదయం పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడుతో కలిసి పరిశీలించారు. స్ధానిక లాలా చెరువు మునిసిపల్ కార్పొరేషన్ హై స్కూల్ లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రశాంతి పరీక్షల కేంద్రం లో మౌలిక సదుపాయాలు కల్పించడంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకి తగిన త్రాగునీటి సరఫరా విధానం, పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు పై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ కి అవకాసం లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా పాఠశాల విద్య అధికారి కె వాసుదేవ రావు ఉన్నారు. స్ధానిక దానవాయిపేట మునిసిపల్ కార్పొరేషన్ హై స్కూల్ పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, అక్కడి ఏర్పాట్ల పై అధికారులకి సూచనలను చేశారు.

# కొబ్బరి,ఆయిల్ ఫామ్ లో అంతర్ పంటగా కోకోతో అధిక లాభాలు-రిని.

## హెక్టార్కు 20వేలు ప్రభుత్వ ప్రోత్సాహాలు.

**కోరుకొండ, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కొబ్బరి,ఆయిల్ ఫామ్ తోటల్లో రైతులు అంతర్ పంటగా కోకో వేసుకున్నట్లయితే అధిక లాభాలు పొందవచ్చునని మండల ఉద్యానశాఖ అధికారిణి రిని అన్నారు. సోమవారం ఆమె గోదావరి విలేకరితో మాట్లాడుతూ రైతులు కొబ్బరి, ఆయిల్ ఫామ్ తోటలో అంతర్ పంటగా కోకో వేసుకున్నట్లయితే అధిక దిగుబడితో ఆర్థికంగా బలోపేతం కావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వం కోకో సాగుకు ప్రోత్సాహంగా హెక్టార్కు 20వేల రూపాయలు రాయితీ అందిస్తుందన్నారు. రైతులు కోకో సాగుకు ఈ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే అధిక దిగుబడితో లాభసాటిగా ఉంటుందన్నారు. రైతులు తమకు ఉన్న భూమిలోనే ఎక్కువ పంటలు పండించుకోవడం వల్ల నికర ఆదాయం పెరుగుతుంది.ఒక పంటలో నష్టం వచ్చిన,అంతర్ పంటగా వేసిన మిగిలిన పంటల్లో నికరఆదాయం వస్తుందన్నారు. అంతర్ పంటల్లో కోకో ప్రధానం ఆయిల్ పామ్, కొబ్బరితోటలో వేసుకుంటే కోకోలో అధిక దిగుబడులు, మంచి నాణ్యమైన ఉత్పత్తిని పొందుకునే ఈ పద్ధతులు అవలంబించాలన్నారు. కచ్చితంగా జూన్, జూలై మాసాల్లో కొమ్మ కత్తిరింపులు చెయ్యాలని,చెట్టును గొడుగు ఆకారంలో ఉండేలా చూసుకోవాల న్నారు.వచ్చిన గింజలను 5 రోజుల్లో ట్రేలో నిలువ చేసి ప్రతిరోజు కలపాలన్నారు.గుజ్జు నుంచి విడిపోయిన గింజలను బరకంపై 5,6 రోజులు ఎండబెట్టాలని,బాగా ఎండిన గింజలు ముదురు గోధుమరంగుకు వస్తాయి.ఇసుక,మట్టి,వంటివి లేకుండా శుభ్రమైన బాగా ఆరినగింజలును గోను సంచల్లోలో ఎత్తి తేమలేని చోట నిల్వచేసుకోవాలి.తప్పడ గింజలను,పొట్టు వంటి గింజలను కచ్చితంగా మంచి గింజలతో కలపకుండా వేరు చేయాలన్నారు.తేమ ఉన్న గింజలపై ఫంగస్ చేరి మంచి గింజలను కూడా పాడుచేసే ప్రమాదం ఉందని,కాబట్టి గింజలు బాగా ఆరేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. కోకో పెంపకం, నాణ్యతా ప్రమాణాలపై రైతులకు క్షేత్రస్థాయిలో ఉద్యానశాఖ వారు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఒక హెక్టారుకు 400-500 కోకో మొక్కలను కొబ్బరి,ఆయిల్ ఫామ్ తోటల్లో వేసుకోవచ్చున్నారు. ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

# కడియంలో ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

## ఆరు కేంద్రాలు, 928 మంది విద్యార్థులు



**కడియం, మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ మండలాల్లో ఆరు పరీక్షా కేంద్రాల్లో 928 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు మినహా మిగిలినవారంతా మొదటిరోజు హాజరైనట్లు ఎంఈఓ మణికుమార్ తెలిపారు. కడియం హైస్కూల్లో 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా వేమగిరిలో 96, కడియపులంకలో 83,వేమగిరిలో 120, జేగురుపాడులో 200 మంది పరీక్షలు రాసారు.ఇక మురమండలో 215 మందికి గాను 213 మంది పరీక్షలు రాసినట్లు ఎంఇవొ తెలిపారు. అయితే ఈ మొత్తం విద్యార్థుల్లో ఏ స్కూలు నుంచి ఎంతమంది విద్యార్థులు అనే వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్తు పాఠశాలలకు సంబంధించి 695 మంది విద్యార్థులకు గాను వేమగిరిలో 78 మంది,వేమగిరి తోటలో 18,కడియం 168, జేగురుపాడు 54, వీరవరం 120,మాదవరాయడుపాలెం 43, కడియపులంక 83, మురమండ 60, దుళ్ల 71 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేటు పాఠశాల సంబంధించి 233 విద్యార్థుల వివరాలు..షిర్డీ సాయి విద్యానికేతన్ 26 మంది, మినర్వా పబ్లిక్ స్కూలు 60, శ్రీ ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ 60, మాస్టర్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 28,జెనిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కడియపుసావరం 18, అమరావతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ దుళ్ల 41 మంది విద్యార్థులు ఉన్నారు.

# పేదలకు అభయ హస్తం సీఎం సహాయ నిధి..

**39 మంది లబ్ధిదారులకు రూ 46 లక్షల 28 వేల 610 అందజేత.. ఎమ్మెల్యే అంజిబాబు**

**భీమవరం మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



పేదలకు అభయ హస్తం సీఎం సహాయ నిధి అని, బాధిత కుటుంబాలకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు రూ 46,28,610 ల చెక్కులను ఎమ్మెల్యే అందించి మాట్లాడారు. ఆపద సమయాల్లో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని, మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇప్పటి వరకు 5 నెలల్లో 72 మందికి రూ 80,98,251ల చెక్కులను భీమవరం నియోజకవర్గంలో అందించామని అన్నారు. కార్యక్రమంలో టీడీపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వర్రావు, పొత్తూరి బాపిరాజు, చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, ఎంపీటీసీ యాళ్లబండి ఇందిరా, పడమటి రామకృష్ణ, కొప్పినిడి శ్రీనివాస్, అడ్డాల శ్రీరామ్మూర్తి, ఆకుల బాలరాజు, గుసిడి సూరిబాబు, చెరుకువాడ సతీష్, యాతం రామకృష్ణ, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

# శ్రీ రామ సంకీర్తనలతో శ్రీ రామదాసు జయంతి





విశాఖపట్నం మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బీచ్ రోడ్డు శ్రీ ప్రసన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి దేవాలయంలో శ్రీ శారద అన్నమయ్య సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు పారుపల్లి సత్యనారాయణ సారధ్యంలో భద్రాచల శ్రీరామదాసు సంకీర్తనలతో శ్రీరామదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు . భద్రాచల శ్రీరామదాసు జయంతిని సాహితీవేత్త విశ్లేషకులు పి శ్రీరామచంద్రమూర్తి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం వి రాజశేఖర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు .

అనంతరం శ్రీరామచంద్రమూర్తి భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ వాగ్గేయ కారులు శ్రీరామదాసు రచించిన శ్రీరామ నామంతో కూడిన శ్రీరామదాసు సంకీర్తనలను గానం చేయడం ద్వారా సీతా సమేతుడైన శ్రీ రామచంద్ర మూర్తి పరిపూర్ణ కటాక్షం లభిస్తుందన్నారు . ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ మాట్లాడుతూ మహానగర విశాఖలో శ్రీ శారద అన్నమయ్య సంగీత విద్యాలయానికి ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉండడమే కాకుండా శాస్త్రీయ సంగీత శిక్షణా సంస్థగా విశిష్టమైన కీర్తి లభించిందని తెలిపారు . భద్రాచల శ్రీ రామదాసు రచించిన సంకీర్తనలో ప్రత్యేకతను పొందిన నవరత్నాలుగా పిలవబడే 9 సంకీర్తనలను సంగీత గురువు పారుపల్లి సత్యనారాయణ వారి శిష్య బృందం మధురంగా ఆలపించి సభను రంజింపజేసి అందర్నీ ఆకట్టుకున్నారు . వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిపద్మావతి , కుమారి పి శారద , నేత్ర వైద్యులు డాక్టర్ ఏవిఎన్ శెట్టి , ఆలయ అర్చకులు శ్రీరామశర్మ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు , సంగీత కళాభిమానులు పాల్గొన్నారు . కార్యక్రమంలో భాగంగా శ్రీరామదాసు జయంతిని పురస్కరించుకుని శ్రీరామునికి అర్చన అష్టోత్తర పూజ నిర్వహించి కుమారి మరియు సుధా సుందరకాండ గానం చేశారు .

## రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌ను

# మర్యాదపూర్వక కలయిక



గాజువాక మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరావును ఆదివారం సాయంత్రం విశాఖ జిల్లా యాదవ మహిళ సంఘం నాయకులు తోణంగి వెంకటరమణి యాదవ్, ఐక్య వేదిక నాయకులు ఆల్తి అప్పలనారాయణ, యాదవ ఉద్యోగ సంఘాల నాయకులు పల్లా మహేష్ లు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసారు.

ఈ సందర్భంగా తోణంగి వెంకట రమణి మాట్లాడుతూ విశాఖ జిల్లాలో యాదవ మహిళలకు, అలాగే బీసీ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. అల్తి అప్పలనారాయణ మాట్లాడుతూ యాదవ యువతకు విద్యా పరంగా, ఆర్థిక పరంగా, విదేశీయా విద్యా విషయంలో ప్రభుత్వం నుండి తగిన సహకారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఈగల మహేష్, సీనీయర్ యాదవ సంఘం నాయకులు పిన్నింటి ఆదిమూర్తి, నక్క సాంబశివరావు, ఒమ్మి రాజు, ఈగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నగర కాలుష్య నిర్మూలనకు విశాఖ ప్రజలు సహకరించండి

## నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



విశాఖపట్నం మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కాలుష్య నిర్మూలనకు విశాఖ ప్రజలు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె క్యాంపు కార్యాలయం నుండి ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఏపీఎస్ఆర్టీసీ బస్సులో జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకొని అందరికీ స్ఫూర్తినిచ్చారు.

ఈ సందర్భంగా నగర మేయరు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం నిత్యం పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒకరోజు వ్యక్తిగత వాహనాలను విడనాడి ప్రజా రవాణాలను ఉపయోగించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో కాలుష్యం నిత్యం పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జివిఎంసి అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాలను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపధ్యంలో ఎకో-జీరో పొల్యూషన్ కార్యక్రమాలలో భాగంగా విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జివిఎంసి అనేక అవగాహనా పరమైన కార్యక్రమాలు నిత్యం చేపట్టడం జరుగుతోందన్నారు. నగరంలో కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వ్యవస్థను లేదా సైకిళ్లను ఉపయోగించడం వలన విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చునని అందుకు అందరూ సహకరించాలని నగర మేయర్ విజ్ఞప్తి చేశారు.

# బీసీల అభివృద్దే ధ్యేయం... తోణంగి



గాజువాక మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల బీసీ వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తోణంగి వెంకటరమణి అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలో జరిగిన జాతీయ బీసీ సంఘం సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

అనంతరం ఆమె సమక్షంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో గల పలువురు బీసీలకు రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు వై నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మలు సభ్యత్వం అందజేసారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, ఈశ్వరమ్మ, రాజేశ్వరి, నందిని, కర్రి లక్ష్మి, కుమారి, సునిత, శ్రీదేవి, సుమ్మ, పెంటమ్మ, సింహచలం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసిన

# ఏపిఎస్సిపిసిఆర్ సభ్యులు సీతారాం



విశాఖపట్నం మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మద్దిలపాలెం:మద్దిలపాలెం సెక్టార్ లో గల కె.ఆర్.ఎం. కోలనీలో గల అంగన్వాడీ కేంద్రం 1 ను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపి ఎస్సిపిసి ఆర్) సభ్యులు గొండు సీతారాం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అంగన్వాడీ వర్కర్ సుబ్బలక్ష్మి నుండి పిల్లల సమాచారాన్ని రాబట్టారు, తక్కువ ఎత్తు,బరువు ఉన్న పిల్లలకు ఎటువంటి పౌష్టికాహార చర్యలు చేపడుతున్నారు,గత ఏడాదిలో ఉన్న మొత్తం పిల్లల్లో ఆడ,మగ పిల్లల సంఖ్య ఎంత,గర్భిణీలు, బాలింతలు ఎంతమంది,వారికి పౌష్టికాహార రూపంలో ప్రభుత్వం అందిస్తున్న పదార్థాలు ఏ ప్రాతిపదికన అందిస్తున్నారు,ఈ విద్యా సంవత్సరంలో ఎంతమంది పిల్లలు పాఠశాలల్లో చేర్చేందుకు చర్యలు చేపడుతున్నారు,అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు చేరేందుకు ఎటువంటి అవగాహన చర్యలు చేపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు,అలాగే స్టాక్,ఇతర రిజిస్టర్లను పరిశీలించారు,బాలామృతం,కోడిగుడ్లు పంపిణీ ఎలా జరుగుతుందో నిశితంగా పరిశీలించారు, సూపర్ వైజర్,చైల్డ్ డెవలప్మెంట్ ప్రోజెక్ట్ ఆఫీసర్లు, ఇతర ఉన్నతాధికారులు ఎన్ని రోజులకోసారి కేంద్రాలను తనిఖీ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

అనంతరం సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అంగన్వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు లేక ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దెలు సరిపడక చిన్నపాటి గదుల్లో ఎక్కువ మంది పిల్లలు ఉండడం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దృష్టికి వచ్చిందని అన్నారు,దీనిని దృష్టిలో ఉంచుకొని స్వంత స్థలాలు ఉన్నచోట ప్రభుత్వం స్వంత భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఇప్పటికే తమ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేసినట్టు సీతారాం తెలిపారు.

## పదవ తరగతి పరీక్షల సందర్భంగా

# మజ్జిగ అందచేసిన ఉక్కునగరం శ్రీ సత్య సాయి సేవా సమితి



విశాఖపట్నం మార్చి 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈ రోజు ఉక్కునగరం, సెక్టార్ 6 లోని విశాఖ విమల విద్యాలయ స్కూల్లులో పదవ తరగతి పరీక్షలు వ్రాయడానికి వచ్చిన విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు ఎండ నుంచి ఉపశమనం కలుగచేయడానికి ఉక్కునగరం శ్రీ సత్య సాయి సేవా సమితి సభ్యులు ప్రేమతో మజ్జిగ అందచేసారు.

## లేకలేక ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహిస్తే..

# పీసీబీకి భారీ నష్టాలు!




పాకిస్థాన్ : సుదీర్ఘకాలం అనంతరం స్వదేశంలో ఓ మెగా టోర్నీ నిర్వహించిన పాకిస్థాన్‌కు అన్నీ చేదు అనుభవాలే. ఛాంపియన్స్ ట్రోఫీ లీగ్ దశలోనే దారుణమైన ప్రదర్శనతో పాకిస్థాన్ వైదొలగడం ఒకెత్తయితే.. టీమ్ఇండియా టైటిల్ గెలుచుకోవడం దానికి మింగుడుపడని విషయం. మరోవైపు దుబాయ్‌లో ట్రోఫీ బహూకరణ సమయంలో పాకిస్థాన్ ప్రతినిధులను పోడియం పైకి ఆహ్వానించకపోవడంతో మరింత అవమానభారంతో కుంగిపోతోంది. మరోవైపు ఈ టోర్నీ నిర్వహణతో పాక్ క్రికెట్ బోర్డుకు భారీ నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. దీంతో ఆ బోర్డుకు కోలుకోలేని దెబ్బ తగిలినట్లైంది.

ఆతిథ్య దేశం అయినప్పటికీ.. పాకిస్థాన్ స్వదేశంలో ఆడింది ఒకేఒక్క మ్యాచ్. లాహోర్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఓటమి పాలైంది. ఆ తర్వాత దుబాయ్ వేదికగా భారత్‌తో ఆడిన మ్యాచ్‌లోనూ ఆ జట్టు చిత్తుగా ఓడింది. ఇక బంగ్లాదేశ్‌తో మూడో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో టోర్నీ నుంచి పాక్ నిష్క్రమించింది.

ఈ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పీసీబీ 18 బిలియన్ పాకిస్థాన్ రూపాయల(58 మిలియన్ డాలర్లు)ను ఖర్చు చేసినట్లు ఓ మీడియా నివేదిక పేర్కొంది. రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియాల ఆధునికీకరణ కోసం ఈ నిధులను వెచ్చించింది. అయితే.. ఇది అంచనా వేసిన బడ్జెట్ కంటే 50 శాతం ఎక్కువ. దీంతోపాటు ఈవెంట్ సన్నాహాల కోసం 40 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అయితే.. హోస్టింగ్ ఫీజులో భాగంగా పీసీబీ 6 మిలియన్ డాలర్లు మాత్రమే అందుకున్నట్లు సమాచారం. ఇక టికెట్ అమ్మకాలు, స్పాన్సర్‌షిఫ్‌ల విషయానికి వస్తే వాటి ఆదాయాలు చాలా తక్కువగా ఉన్నాయి.

దీంతో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణతో.. పాక్ క్రికెట్ బోర్డు 85 మిలియన్ డాలర్లు నష్టపోయినట్లు తెలుస్తోంది. ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి బోర్డు సతమతమవుతోంది. దీంతో ఆటగాళ్ల మ్యాచ్ ఫీజుల్లో భారీగా కోత విధించాలని పీసీబీ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నేషనల్ టీ20 ఛాంపియన్‌షిప్‌లో ఆడే ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 90 శాతం, రిజర్వ్ ఆటగాళ్లకు 87.5 శాతం కోత పెట్టనుందట.

ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును రూ.40 వేల నుంచి రూ.10 వేలకు పీసీబీ ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా తగ్గించినట్లు అక్కడి డాన్ పత్రిక పేర్కొంది. అయితే బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ ఈ విషయంలో జోక్యం చేసుకున్నారని.. వ్యతిరేకించారని తెలిపింది. ఈవిషయాన్ని తిరిగి అంచనా వేయాలని బోర్డు దేశీయ క్రికెట్ విభాగాన్ని ఆదేశించినట్లు పేర్కొంది. మరోవైపు ఆటగాళ్లకు 5 స్టార్ హోటల్ వసతులను కూడా తగ్గించి.. ఎకానమీ హోటళ్లతో సర్దుకోవాలని బోర్డు చెప్పినట్లు సమాచారం.

# ప్రత్యర్థుల పాలిట అతడు డేంజరస్ ప్లేయర్..

## అక్షర్ కెప్టెన్సీని పంత్‌తో పోల్చిన పోరెల్




**ఢిల్లీ : త్వరలో ప్రారంభం కానున్న ఐపీఎల్ 18వ సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ సిద్ధమవుతోంది. ఒక్కసారి కూడా టైటిల్ గెలవని ఆ జట్టు.. ఈసారి భారీ ప్రక్షాళనతో ముందుకువస్తోంది. స్టార్ ఆటగాడు రిషభ్‌పంత్‌ను ఐపీఎల్ వేలానికి ముందే వదిలేసుకున్న నేపథ్యంలో.. ఈసారి అక్షర్‌పటేల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. అయితే.. ఈ సీజన్‌లో రిషభ్ పంత్ సేవలను తాము మిస్ అవుతున్నట్లు ఆ జట్టు యువ ఆటగాడు అభిషేక్ పోరెల్ అంగీకరించాడు. ఈసారి తాము టైటిల్ గెలవాలని కోరుకుంటున్నాడు.**

'గత సీజన్‌లో పంత్ కెప్టెన్సీలో ఆడా. ఎన్నో విషయాలు నేర్చుకున్నా. అతడో మ్యాచ్ విన్నర్. అతడిని కచ్చితంగా మేం మిస్ అవుతున్నాం. క్రికెట్ అనేది యుద్ధం లాంటిది. మేం ఈ సారి టైటిల్ గెలవాలి" అని పోరెల్ పేర్కొన్నాడు. కొత్త సారథి అక్షర్‌పటేల్ నాయకత్వ లక్షణాలను పంత్ కెప్టెన్సీతో పోల్చి ప్రశంసించాడు.

"బాపు (అక్షర్ పటేల్) ప్రత్యర్థుల పాలిట డేంజరస్ ప్లేయర్. గత రెండేళ్లుగా అతడితో గొప్ప అనుబంధం కొనసాగుతోంది. రిషభ్ పంత్, అక్షర్ కెప్టెన్సీ దాదాపు ఒకే రకంగా ఉంటుంది. వారెంతో సరదాగా ఉంటారు. ఈసారి మా జట్టు బాగుంది. ట్రోఫీ గెలిచేందుకు మేమంతా అన్ని రకాలుగా సిద్ధమవుతున్నాం" అని పేర్కొన్నాడు.

కొంతకాలంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో తన ప్రయాణాన్ని కొనసాగించిన పంత్‌ను.. ఈ సారి వేలంలో లఖ్‌నవూ జట్టు

## కోల్‌కతా కెప్టెన్సీ.. రహానెకు బదులు

# వారిని ఎంచుకోవాల్సింది: హర్భజన్




కోల్‌కతా : 2024 ఐపీఎల్ సీజన్‌లో జట్టును విజేతగా నిలబెట్టిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ వదులుకుంది. దీంతో ఈ సీజన్‌కు సీనియర్ ఆటగాడు రహానె కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. అయితే.. తొలుత వెంకటేశ్ అయ్యర్‌కు జట్టు పగ్గాలు అప్పగిస్తారని వార్తలు వచ్చినప్పటికీ.. అనుభవం దృష్ట్యా చివరికి రహానె వైపు మొగ్గు చూపింది. ఈ నిర్ణయంపై పలువురు మాజీలు స్పందిస్తున్నారు.

బ్యాటింగ్ ఆర్డర్ విషయంలో జట్టుకు ఇబ్బందులు ఎదురవుతాయని మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించారు. కేవలం కెప్టెన్సీ కోసం రహానెను తీసుకొని ఉంటే.. అతడికి బదులుగా వేరే వారి పేరును ప్రకటించి ఉండాల్సిందని హర్భజన్ అభిప్రాయపడ్డాడు. "రహానె నంబర్ 3 స్థానంలో బ్యాటింగ్‌కు రావడం ఉత్తమం. ఎందుకంటే ఓపెనర్లు స్థిరంగా ఉన్నారు. రహానెను కేవలం సారథ్య బాధ్యతల కోసమే ఎంపిక చేసి ఉంటే.. అందుకోసం సునీల్ నరైన్, వెంకటేశ్ అయ్యర్, రస్సెల్ లాంటి వారిని ప్రకటించి ఉండాల్సింది" అని సూచించాడు.

ఇక మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా .. కేకేఆర్ కెప్టెన్సీ అంశంపై ఆందోళన వ్యక్తంచేశాడు. ఈ సీజన్ అంతా రహానె కెప్టెన్-బ్యాటర్‌గా ఇబ్బందిపడతాడని పేర్కొన్నాడు. ఈ నిర్ణయం తీసుకోవడం వెనక ఉన్న కారణాన్ని తాను అర్థం చేసుకున్నప్పటికీ.. రహానె బ్యాటర్‌గా విఫలమైతే.. అది జట్టుపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని హెచ్చరించాడు. "మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ బాగా ఆడతాడు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని గెలవడంలో కీలకంగా వ్యవహరించాడు. అతను మంచి ఫామ్‌లో ఉన్నాడు. అయితే అతడిని వదిలిపెట్టారు. ఇక ఈ సీజన్‌లో రహానెను 'కెప్టెన్-బ్యాటర్' అంశం ఇబ్బంది పెడుతుంది. ఈడెన్ గార్డెన్స్‌లో అతడు ఓపెనింగ్ చేయడం ఉత్తమం. లేకపోతే మూడో స్థానంలోనైనా బ్యాటింగ్ చేయాలి. అంతకంటే దిగువన బ్యాటింగ్‌కు వస్తే అతడి ప్రభావం తగ్గుతుంది. ఎందుకంటే పవర్ ప్లే అతడికి అవసరం" అని చోప్రా విశ్లేషించాడు. రహానె నంబర్ 3 స్థానంలో బ్యాటింగ్‌కు రావడం ఉత్తమమని పేర్కొన్నాడు. "సునీల్ నరైన్ ఓపెనింగ్ చేస్తాడు. డికాక్ జట్టులో ఉంటే అతడికి తోడుగా ఓపెనర్ బ్యాటర్‌గా వస్తాడు. గత సీజన్‌లో రాణించిన నరైన్‌ను ఓపెనర్‌గా వద్దని యాజమాన్యం ఇప్పుడు చెప్పగలదా..? అందుకే.. వెంకటేశ్ అయ్యర్ ఆడే మూడో స్థానం రహానెకు ఉత్తమం. లేదంటే అతడు బ్యాటర్‌గా తన ఆశలు వదులుకోవాల్సిందే" అని చోప్రా పేర్కొన్నాడు.

ఇక ఈ ఐపీఎల్ సీజన్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా.. బెంగళూరును ఎదుర్కోబోతోంది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే ఈ మ్యాచ్ కోసం తాము సిద్ధమైనట్లు హెడ్ కోచ్ చంద్రకాంత్ పండిట్ వెల్లడించాడు.

# ఆర్సీబీ కెప్టెన్సీని కోహ్లీ అందుకే వద్దనుకున్నాడు..!




బెంగళూరు : మరికొన్ని రోజుల్లో క్రికెట్ అభిమానులను అలరించేందుకు మెగా టోర్నీ ఐపీఎల్ సిద్ధమవుతోంది. ఈసారి పలు జట్లు కొత్త కెప్టెన్లతో ముందుకు వస్తున్నాయి. వాటిలో అందరి దృష్టి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపైనే ఉంది. ఎందుకంటే.. ఈసారి ఆ జట్టు రజత్ పటీదార్ ను సారథిగా ఎంచుకుంది. దీంతో విరాట్ కోహ్లీని మళ్లీ కెప్టెన్‌గా చూస్తామన్న అభిమానులకు నిరాశ ఎదురైంది. నిరుడు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన దక్షిణాఫ్రికా ఆటగాడు ఫాఫ్ డూప్లెసిస్‌ను ఆర్సీబీ వేలానికి ముందు వదులుకున్న సంగతి తెలిసిందే. సారథ్య అనుభవం ఉండటంతో ఫ్రాంఛైజీ యాజమాన్యం రజత్ వైపు మొగ్గు చూపింది.

అయితే.. ఆర్సీబీ కెప్టెన్సీని కోహ్లీ వద్దనుకోవడంతోనే రజత్ వైపు యాజమాన్యం మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఇదే అంశంపై ఆ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మ వ్యాఖ్యనించాడు. కోహ్లీ ఈ సీజన్‌కు కెప్టెన్‌గా ఎందుకు అంగీకరించలేదో కారణాన్నీ వివరించాడు. ఇక రజత్ పటీదార్ కెప్టెన్ అన్న విషయం తనకు జట్టు సోషల్ మీడియా పోస్టు ద్వారానే తెలిసిందని వ్యాఖ్యానించాడు.

"రజత్ పటీదార్ కెప్టెన్ అయ్యాడన్న విషయం అందరితోపాటే నాకు తెలిసింది. అయితే.. విరాట్ భాయ్ కెప్టెన్‌గా ఉండాలనుకోలేదు. కోహ్లీ ఎందుకు ఆ నిర్ణయం తీసుకున్నాడో నాకు తెలియదు. నేను మేనేజ్‌మెంట్‌లో భాగం కాదు. కోహ్లీ గత రెండు, మూడేళ్లుగా కెప్టెన్సీ చేయడం లేదు. అందుకే ఈ ఏడాది కూడా సారథ్య బాధ్యతలు తీసుకోడని నేను భావించాను. రజత్ పటీదార్ ఉత్తమ ఎంపిక" అని జితేశ్ ఓ పాడ్‌కాస్ట్‌తో మాట్లాడుతూ అన్నాడు. ఇక ఇదే అంశంపై జట్టు డైరెక్టర్ మోబోబాట్ స్పందించాడు. గత నెలలో ఆర్సీబీ కెప్టెన్‌ను ప్రకటించే ముందు.. కోహ్లీతో చర్చించినట్లు అతడు స్పష్టంచేశాడు. కెప్టెన్ ఎంపిక విషయంలో అతడు చూపించిన పరిణితిని కొనియాడాడు. రజత్‌ను కోహ్లీ ఇష్టపడతాడని.. ఒక ఆటగాడిగా, వ్యక్తిగా అతడిని గౌరవిస్తాడని తెలిపాడు. ఇక ఈ సీజన్ తొలిమ్యాచ్‌లో ఈనెల 22న బెంగళూరు.. కోల్‌కతాతో తలపడనుంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.

## థాంక్యూ ధోనీ.. అప్పుడు రాలేదు..

# ఇప్పుడు బెస్ట్ 'గిఫ్ట్' ఇచ్చావు: అశ్విన్



**ధర్మశాల : చాన్నాళ్ల తర్వాత మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు రవిచంద్రన్ అశ్విన్ సిద్ధమైపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత అశ్విన్ తొలిసారి ఐపీఎల్ ఆడబోతున్నాడు. ఈ క్రమంలో టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గురించి అశ్విన్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకొన్నాడు. తనకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైనప్పటికీ.. ఇలాంటి గిఫ్ట్ ఇస్తాడని ఊహించలేదని వ్యాఖ్యానించాడు. వందో టెస్టు సందర్భంగా బీసీసీఐ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసి అశ్విన్‌కు జ్ఞాపికను అందజేసింది. అయితే, ఆ మెమొంటోను ధోనీ చేతులమీదుగా తీసుకోవాలని అశ్విన్ భావించాడట. కానీ, అలా జరగలేదు. ఇదే విషయాన్ని అశ్విన్ తాజాగా వెల్లడించాడు.**

"ధర్మశాల వేదికగా మ్యాచ్ జరిగింది. అది నా వందో టెస్టు. ధోనీ చేతులమీదుగా మెమెంటో తీసుకోవాలని భావించా. అదే నా చివరి మ్యాచ్ అవుతుందని అనుకున్నా. అయితే, ఆ టెస్టుకు ధోనీ రాలేదు. ఇప్పుడు మాత్రం నన్ను సీఎస్కేకు మళ్లీ తీసుకొని ఇలాంటి మంచి బహుమతి ఇస్తాడని అనుకోలేదు. ఎంఎస్ ధోనీకి ధన్యవాదాలు. నీవల్లే ఇక్కడున్నా. మరీ ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ఇప్పటివరకు నేను చాలా క్రికెట్ ఆడా. ఎంతో సాధించా.. కానీ అదంతా పక్కనపెట్టేసి ఇప్పుడు ఆటను ఆస్వాదించాలని భావిస్తున్నా" అని అశ్విన్ వెల్లడించాడు.

తుది జట్టులో పోటీ తీవ్రం

తుది జట్టులో స్థానం కోసం చెన్నైలో తీవ్రమైన పోటీ ఉంది. స్పిన్ విభాగంలో ఇప్పటికే రవీంద్ర జడేజా ముందు వరుసలో ఉన్నాడు. అతడితోపాటు ఇప్పుడు అశ్విన్ కూడా జత కలిస్తే సీఎస్కేకు తిరుగుండదు. అదే సమయంలో అఫ్గాన్ యువ స్పిన్నర్ నూర్ అహ్మద్‌కు అవకాశం ఇస్తారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారనుంది. ఇక రచిన్ రవీంద్ర వంటి ఓపెనర్ కమ్ స్పిన్నర్ కూడా ఆ జట్టులో ఉన్నాడు. కానీ, అతడిని ఇన్నింగ్స్‌ను ప్రారంభించేందుకు పంపించే అవకాశాలు తక్కువే. డేవన్ కాన్వే వంటి భారీ హిట్టర్ ఉండటంతో రచిన్‌ను మిడిలార్డర్‌కే పరిమితం చేసే ఛాన్స్ ఉంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# ఏంటి కీర్తి ఇలా మారిపోయింది

**కీర్తి సురేష్ సినీ ప్రస్థానం %-% గ్లామర్, ప్రతిభ, విజయాల మేళవింపు**



సినీరంగంలో హీరోయిన్ కీర్తి సురేష్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆమె తన సహజమైన అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకొని, దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించింది. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించిన కీర్తి, తన అందం, అభినయంతో అభిమానులను ముగ్ధులను చేసింది. ముఖ్యంగా తెలుగులో మహానటి చిత్రంలో సావిత్రి పాత్ర పోషించి, నటనకు కొత్త ప్రమాణాలు నెలకొల్పింది. ఈ పాత్ర ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టడమే కాకుండా ఉత్తమ నటిగా జాతీయ అవార్డు కూడా అందించింది.

**హిందీలో 'బేబీ జాన్'తో అరంగేట్రం**

కీర్తి సురేష్ ఇటీవల హిందీ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తన అభినయాన్ని బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం చేసింది. 'బేబీ జాన్' అనే హిందీ సినిమాలో నటించి, అక్కడ కూడా మంచి పేరు తెచ్చుకుంది. సౌత్ ఇండస్ట్రీలో ఇప్పటికే స్టార్ హీరోయిన్‌గా వెలుగొందుతున్న కీర్తి, బాలీవుడ్‌లోనూ తన ప్రత్యేకతను నిరూపించుకునేందుకు సిద్ధమవుతోంది.

**కుటుంబ నేపథ్యం %-% సినీరంగంతో ముడిపాటు**

కీర్తి సురేష్ కుటుంబం సినీ పరిశ్రమతో ముడిపడినదే. ఆమె తండ్రి ప్రముఖ నిర్మాత సురేష్ కుమార్, తల్లి మేనక 80వ దశకంలో పేరొందిన నటి. చిన్నతనం నుంచే సినిమా ప్రపంచాన్ని చూసిన కీర్తి, బాలనటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. మలయాళ చిత్రాల్లో చిన్నప్పటి పాత్రల్లో మెప్పించిన ఆమె, తర్వాత హీరోయిన్‌గా మారి దక్షిణాది చిత్రసీమలో తిరుగులేని స్థానాన్ని సంపాదించింది.

**తెలుగు చిత్రసీమలోకి ప్రవేశం %-% టాప్ హీరోయిన్‌గా ఎదుగుదల**

తెలుగులో కీర్తి సురేష్ తొలి చిత్రం 'నేను శైలజ'. రామ్ పోతినేనితో కలిసి నటించిన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కీర్తి, ఆ తర్వాత వరుసగా విజయవంతమైన చిత్రాల్లో నటించి టాలీవుడ్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. 'అజ్ఞాతవాసి', 'రంగ్ దే', 'సర్కారు వారి పాట' వంటి చిత్రాలతో టాప్ హీరోయిన్‌గా నిలిచింది.

**పెళ్లి %-% కొత్త జీవితం, కొత్త దశ**

ఇటీవలే కీర్తి సురేష్ పెళ్లి చేసుకొని కొత్త జీవనానికి అడుగుపెట్టింది. పెళ్లి కారణంగా కొద్దిరోజులు సినిమాలకు విరామం తీసుకున్న ఈ భామ, ఇప్పుడు మళ్లీ వరుస సినిమాలతో బిజీ అయ్యేందుకు సిద్ధమవుతోంది. పెళ్లి తర్వాత మరింత గ్లామరస్‌గా మారిన కీర్తి, వరుస ఫోటోషుట్లతో అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది.

**సోషల్ మీడియాలో హల్‌చల్**

కీర్తి సురేష్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్. ఆమె తరచుగా తన ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ అకౌంట్ల ద్వారా అభిమానులతో టచ్‌లో ఉంటుంది. ముఖ్యంగా గ్లామరస్ ఫోటోషుట్స్, సినిమా అప్డేట్స్, ట్రావెల్ డైరీస్ వంటివి షేర్ చేస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తుంది.

**కీర్తి సురేష్ భవిష్యత్ ప్రాజెక్ట్స్**

ప్రస్తుతం కీర్తి చేతిలో భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళం, హిందీ భాషల్లోనూ ఆమె బిజీగా మారనుంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో భాగమవుతూ, తన నటనను మరింతగా విస్తరించేందుకు సిద్ధమవుతోంది.



# బోల్డ్ అవతారంతో కవ్విస్తున్న రియాలిటీ బ్యూటీ

రియాలిటీ షోలతో మంచి పేరు తెచ్చుకుంది షామా శికందర్. -యే మేరీ లైఫ్ హై- ఈ బ్యూటీకి మంచి పేరు తెచ్చిన సంగతి తెలిసిందే.

రియాలిటీ షోలతో మంచి పేరు తెచ్చుకుంది షామా శికందర్. %-%యే మేరీ లైఫ్ హై%-% ఈ బ్యూటీకి మంచి పేరు తెచ్చిన సంగతి తెలిసిందే. బుల్లితెర, వెండితెర రంగంలో కెరీర్ సాగిస్తున్న ఈ బ్యూటీ విదేశీ ప్రియుడు జేమ్స్ మిల్లిరోన్ తో రొమాంటిక్ డేట్ లో ఉన్న సంగతి తెలిసిందే. షామా నిరంతర ఫోటోషుట్లు, వీడియో షుట్లతో సోషల్ మీడియాల్లో భారీ ఫాలోయింగ్ పెంచుకుంది. ముఖ్యంగా ఈ బ్యూటీ బోల్డ్ ఫోటోషుట్లకు విపరీతమైన స్పందన వస్తోంది. ఇటీవల వరస ఫోటోషుట్‌లతో అగ్గి రాజేస్తున్న ఈ బ్యూటీ తాజాగా మరో బోల్డ్ ఫోటోషుట్ ని షేర్ చేయగా అది ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. భర్త మిల్లిరాన్ తో కలిసి ఓ ఫ్యాషన్ ఈవెంట్ కి అటెండయిన షామా ఈ స్పెషల్ యూనిక్ ఫోటోషుట్ తో రెచ్చిపోయింది. గుర్తుంచుకోవాల్సిన సాయంత్రం! అంటూ షామా ఈ ఫోటోషుట్ ని ఇన్ స్టాలో షేర్ చేసింది. ఇందులో షామా డస్కీ అవతార్, రివీలింగ్ ఔట్ ఫిట్స్ తో మరోసారి మతులు చెడగొట్టింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ని యువతరం వైరల్ గా షేర్ చేస్తున్నారు. షామా ఈ కొత్త లుక్ లో ఎంతో గ్లామరస్ గా ఉందంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. ఫోటోషుట్ లో తన భర్తతో కలిసి ఉన్న ఫోటోలను నెటిజనులు షేర్ చేస్తున్నారు. రియాలిటీ క్వీన్ షామా జేమ్స్ మిల్లిరాన్ కి సరిజోడు అని కూడా కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. విదేశీతో షామా రొమాన్స్ అద్భుతంగా కుదిరిందన్న ప్రశంసలు కురుస్తున్నాయి.


# కన్నప్ప మూడో పాట విడుదల



కన్నప్ప మూడో పాట విడుదల డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి మూడో పాటకు సంబంధించిన అప్డేట్ వచ్చేసింది. 'మహాదేవ శాస్త్రి పరిచయ గీతం' పేరుతో ఈ పాటను మార్చి 19న విడుదల చేయనున్నారు. ముఖ్యంగా మోహన్ బాబు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఈ పాటను విడుదల చేయడం మరో విశేషం.మోహన్ బాబు స్పెషల్ రోల్ %-% భారీ స్థాయిలో నిర్మాణం ఈ చిత్రాన్ని మోహన్ బాబు అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అంతేకాక ఆయన స్వయంగా 'మహాదేవ శాస్త్రి' పాత్రలో నటిస్తున్నారు. ఓ విశేషంగా ఈ పాటను ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయడం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది.స్టార్ కాస్ట్ అగ్రహీరోల సమ్మేళనం'కన్నప్ప' సినిమాలో స్టార్ స్టడెడ్ కాస్ట్ కనిపించనుంది.మంచు విష్ణు ప్రీతి ముకుందన్ లీడ్ రోల్స్ పోషిస్తుండగా, అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, ముఖేష్ రిషి, కాజల్ అగర్వాల్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో నటిస్తున్నారు.మ్యూజిక్ హైలైట్ %-% స్టీఫెన్ దేవస్సీ సంగీతం ఈ చిత్రానికి స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన పొందాయి. ఇప్పుడు 'మహాదేవ శాస్త్రి పరిచయ గీతం' కూడా అదే స్థాయిలో ఆకట్టుకునే అవకాశం ఉంది. రిలీజ్ డేట్ %-% ఏప్రిల్ 25న థియేటర్లలో 'కన్నప్ప'ఈ చిత్రానికి ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఏప్రిల్ 25న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

# ఎల్లో ఎల్లో బ్యూటీ ఫెల్లో

కన్ను గీటి, ముద్దుగన్ను పేల్చి ఓవర్ నైట్‌లో జాతీయ స్థాయిలో సెలబ్రెటీ అయిన ప్రియా ప్రకాష్ వారియర్ తాజాగా 'నిలవుకు ఎన్ మెల్ ఎన్నడి కోబం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధనుష్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో ప్రియా ప్రకాష్ వారియర్ కీలక పాత్రలో నటించి మెప్పించింది. ఆ సినిమాతో పాటు విష్ణు ప్రియ అనే కన్నడ మూవీలోనూ నటించింది. ఆ మధ్య ఈ అమ్మడి కెరీర్ కాస్త డల్‌గా సాగింది. కానీ ఇప్పుడు పరిస్థితి వేరుగా ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటికే రెండు సినిమాలతో వచ్చిన ప్రియా ప్రకాష్ వారియర్ మరో రెండు మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ప్రియా ప్రకాష్ వారియర్ తెలుగులోనూ పలు సినిమాల్లో నటించింది. చెక్, ఇష్క్ సినిమాల్లో నటించింది. కానీ ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడటంతో తెలుగులో పెద్దగా ఆఫర్లను ఈ అమ్మడు సొంతం చేసుకోలేక పోతుంది. పవన్ కళ్యాణ్ బ్రో సినిమాలో కీలక పాత్రలో నటించడంతో పాటు మరికొన్ని సినిమాల్లో చిన్న పాత్రల్లో కనిపించింది. టాలీవుడ్‌లో ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కడం లేదు. కానీ సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే అందమైన ఫోటోల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. ఇంత అందమైన అమ్మాయికి ఎందుకు తెలుగులో ఆఫర్లు రావడం లేదని కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేసే ప్రియా ప్రకాష్ వారియర్ తాజాగా ఎల్లో డ్రెస్‌లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా ఎల్లో ఎల్లో డర్టీ ఫెల్లో అంటారు... కానీ ఈ ఫోటోల్లో ప్రియా ప్రకాష్ వారియర్‌ను చూస్తూ ఉంటే దాన్ని మార్చి ఎల్లో ఎల్లో బ్యూటీ ఫెల్లో అనాలి అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేసినప్పుడు మరో ఐదు పది సంవత్సరాల పాటు ఇండస్ట్రీలో ప్రియా వారియర్ ఉంటుంది, ఆమె కచ్చితంగా ముందు ముందు తెలుగులోనూ మంచి సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుంది అంటున్నారు. చూడ్డానికి క్యూట్‌గా అనిపించడంతో పాటు, స్కిన్ షో విషయంలో ఇతర హీరోయిన్స్‌తో పోటీ పడుతూ ఉంటుంది. అందుకే ప్రియా ప్రకాష్ వారియర్‌కి కన్నడ, తమిళ్ సినిమాల్లో క్రమం తప్పకుండా ఆఫర్లు వస్తున్నాయి. ఇండస్ట్రీలో ఈమె చేసిన సినిమాలు, చేస్తున్న సినిమాల విషయం పక్కన పెడితే భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు ఈమె నుంచి వచ్చే అవకాశం ఉందని, హిందీలోనూ ఈమెకు మంచి ఆఫర్లు వస్తాయనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. ఇదే స్థాయిలో అందంగా కనిపిస్తే ముందు ముందు ఈమెకు మరిన్ని ఆఫర్లు రావడం ఖాయం.



TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339